## క్లుప్తంగా

### బకాయి వేతనాలు అందించాలి

తాళ్లరేవు: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉపాధి కూలీలు కోరారు. శుక్రవారం తాళ్లరేవు, కోరంగి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి టి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, కూలీల బకాయి వేతనాలను వెంటనే ఇవ్వాలని అన్నారు. అనంతరం ఉపాధి కూలీలతో కలసి సామాజిక తనిఖీ అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. సర్పంచులు రెడ్డి అరుణ సుహాసినీదేవి, పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్న కుమారి, పంచాయతీ కార్యదర్శులు శంకరనారాయణ, రామరాజు, గంజా సూరిబాబు, టి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఆసెట్ ఉత్తమ ర్యాంకర్లకు అభినందన



ఆసెట్ విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆసెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 2, 7 ర్యాంక్‌లు సాధించిన స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థిని కేశనకుర్తి సత్యవాణి, రాయుడు ప్రజ్ఞలను ఆ కళాశాల యాజమాన్యం శుక్రవారం సత్కరించింది. స్టేటస్టిక్స్ విభాగంలో ఉత్తమ ర్యాంక్ సాధించిన సత్యవాణి ఈ ప్రాంతానికి గుర్తింపు తెచ్చిందని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కేవీఆర్ఎన్ నరసింహారావు అన్నారు. అలాగే ఇదే కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఎస్.అయ్యప్ప శిరీషకు 27, ఎ.గౌతమ్‌కు 64వ ర్యాంకులు వచ్చాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.మనోహర్ తెలిపారు. ఈ విజేతలను కళాశాల ఏఓ కరాటం ప్రవీణ్, అధ్యాపకులు కె.శ్రావణ్‌దిలీప్, డాక్టర్ హేమ విజేత, కె.సౌందర్య, యాలంగి వరప్రసాద్, సీహెచ్ జాన్‌పాల్ అభినందించారు.

### బాల్య వివాహాల నివారణపై కళాజాత



జి.వేమవరం జెడ్పీ హైస్కూల్‌లో కళాజాత ద్వారా అవగాహన కార్యక్రమం

తాళ్లరేవు: బాల్య వివాహాలతో అనర్థాలు, నివారణకు చేపట్టాల్సిన చర్యలను గ్రామాల్లో కళాజాతాల ద్వారా వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వి.మాధవి ఆధ్వర్యంలో శుక్రవారం చినబొడ్డు వెంకటాయపాలెం, జి.వేమవరం గ్రామాల్లో కళాజాతాలు జరిగాయి. ఈ సందర్భంగా కళాకారులు దుర్గాప్రసాద్, తిరుపతయ్య బృందం బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కె.దత్తాత్రేయ వర్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఈఓ లలితా నిర్మల, ఎం.సత్యనళిని, స్కూల్ హెచ్ఎంలు కేఆర్‌కే సాయిప్రసాద్, విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

### ఈ నీరు తాగేదెలా..!



గుండెపూడి ప్రాజెక్టు నుంచి రంగుమారి వచ్చిన తాగునీరు

అల్లవరం: గుండెపూడి రక్షిత మంచినీటి ప్రాజెక్టు నుంచి ప్రజలకు పంపిణీ చేస్తున్న తాగునీటిలో శుద్ధత లోపిస్తుంది. ఈ నీరు రంగుమారి వస్తోంది. దేవగుప్తం, తాడికోన, డి.రావులపాలెం, ఎస్.పల్లిపాలెం, మొగళ్లమూరు, తుమ్మలపల్లి, తూర్పులంక, రెల్లుగడ్డ గ్రామాలకు ఈ నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు రోజులకొకసారి పంపిణీ చేసే తాగునీటిని పూర్తి స్థాయిలో శుద్ధి చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమయానికి తాగునీరు పంపిణీ కాకపోయినా, రంగుమారి నీరు వస్తున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శులు స్పందించడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరిచారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అంధకారంలో రాజీవ్ బీచ్

యానాం: యానాంలో గౌతమీ గోదావరి నదీ తీరం రాజీవ్ రివర్ బీచ్‌లో కొన్ని నెలలుగా విద్యుత్ దీపాలు వెలగక రాత్రయితే అంధకారం అలముకుంటోంది. నిత్యం వందలాదిగా వచ్చే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ, పీడబ్ల్యూడీ అధికారులకు తెలిపినా ఇప్పటి వరకూ స్పందించలేదని స్థానికులు అంటున్నారు.

# నవ మాసాలూ బాధ్యతగా..



బందారులంక పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న వైద్యురాలు

- మాతా శిశు సంరక్షణకు చర్యలు
- పీఎంఎస్ఎంఏ పథకంలో గర్భిణులకు పరీక్షలు
- నియోజకవర్గంలో 557 మందికి సేవలు



తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్

అమలాపురం రూరల్: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చే గర్భిణుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.. తల్లీ బిడ్డల భద్రతకు క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా రెండో వారంలో 9, 10వ తేదీల్లో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) పథకం కింద గర్భిణులకు పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకునేలా ప్రచారం సాగిస్తున్నారు. అమలాపురం పట్టణంలో ఏరియా ఆసుపత్రి, వడ్డిగూడెం, మున్సిపల్ కాలనీ పరిధిలో అర్బన్ సెంటర్లు, అమలాపురం మండలం బండారులంక, పేరూరు పీహెచ్‌లు, అల్లవరం మండలం అల్లవరం సీహెచ్‌సీ, గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీలు, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, ఉప్పలగుప్తం, భీమనపల్లి పీహెచ్‌సీల పరిధిలో 557 గర్భిణులు ఉన్నారు. వీరందరినీ పరీక్షించగా, 77 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించారు. వీరికి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు.

**నియోజకవర్గంలో ఆసుపత్రుల వారీగా గర్భిణులు**

| ప్రభుత్వ ఆసుపత్రి | గర్భిణులు | హైరిస్క్ కేసులు |
|---|---|---|
| అమలాపురం ఏరియా ఆసుపత్రి | 46 | 2 |
| వడ్డిగూడెం అర్బన్ సెంటర్ | 30 | – |
| మున్సిపల్ కాలనీ అర్బన్ సెంటర్ | 20 | 1 |
| బండారులంక పీహెచ్‌సీ | 62 | 6 |
| పేరూరు | 63 | 15 |
| ఉప్పలగుప్తం | 73 | 2 |
| బెండమూర్లంక | 60 | 15 |
| భీమనపల్లి | 58 | 11 |
| గోడిలంక | 74 | 11 |
| ఎస్.యానం | 66 | 12 |
| అల్లవరం సీహెచ్‌సీ | 32 | – |

**అవగాహన కల్పిస్తున్నాం..**



తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది శ్రమిస్తున్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవం చేయించుకునేలా గర్భిణికి అవగాహన కల్పిస్తున్నాం.
–స్వర్ణకమల, పీహెచ్‌సీ వైద్యురాలు, బండారులంక

**ఆసుపత్రిలో ప్రసవమే సురక్షితం**

నూరుశాతం ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిల్లోనే చేయించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. జిల్లాలోని అమలాపురం ఏరియా ఆసుపత్రులతో పాటు సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణి ప్రసవించే వరకూ వైద్య, ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. గత ప్రభుత్వం ప్రసవాలు చేయించుకునే వారికి సైతం ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసింది. ప్రసవం అనంతరం తల్లీ బిడ్డల పౌష్టికాహారానికి రూ.6 వేల సాయాన్ని తల్లి ఖాతాకు జమ చేసింది. గర్భిణి ఇంటి వద్ద నుంచి ఆసుపత్రికి రావడానికి 108 అంబులెన్స్, డిశ్చార్జి అనంతరం ఇంటికి వెళ్లేందుకు 102 వాహన సౌకర్యం కల్పించింది. అమలాపురం ఏరియా ఆసుపత్రికి రెండు చొప్పున వాహనాలను జిల్లాలో పీహెచ్‌సీలకు ఎనిమిది వాహనాలను కేటాయించారు.

**హైరిస్క్ కేసుల గుర్తింపు ఇలా..**

గర్భిణిలో రక్తహీనత, చిన్న వయసులో గర్భం దాల్చడం, ఎక్కువ కాన్పులు, అధిక బీపీ, గుండె, కిడ్నీ జబ్బులు, ఇతర సమస్యలతో గర్భం దాల్చితే హైరిస్క్ కేసులుగా పరిగణిస్తారు. వారి తాలూకు వివరాలను ఏఎన్ఎం ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తుంది. దానికి అనుగుణంగా వైద్య సేవలు అందిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం చేయించుకున్న గర్భిణులకు ఆరోగ్య ఆసరా పథకంలో భాగంగా ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు.

### మురుగు కాలువల్లో పూడికతీత పనులు



పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ అరుణ సుహాసినీదేవి

తాళ్లరేవు: దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా డ్రైనేజీల్లో పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. స్థానిక మాధవరాయుని పేటలో సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి పర్యవేక్షణలో ఈ పనులు చేశారు. వర్షాల దృష్ట్యా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి శంకర నారాయణ తెలిపారు.

### ఇందుపల్లిలో మావుళ్లమ్మ జాతర



మావుళ్లమ్మకు అలంకరణ

అమలాపురం రూరల్: ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మ తీర్థ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి అమ్మవారి జాతర జరిగింది. 15 రోజులుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి తీర్థాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అన్న సమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి.

### సహాయక సంఘాలకు రుణాలు

యానాం: నియోజకవర్గంలోని స్వయం సహాయ సంఘాలు ఉపాధి పొందేందుకు వీలుగా దీన దయాళ్ అంత్యోదయ యోజన– జాతీయ పట్టణాభివృద్ధి పథకం ద్వారా రుణాలు పొందాలని శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ ఓ ప్రకటనలో కోరారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ఒక్కో స్వయం సహాయక సంఘానికి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ రుణం బ్యాంకుల ద్వారా పొందవచ్చన్నారు. మరింత సమాచారం కోసం మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ప్రతి విద్యార్థీ బడిలో ఉండాలి



ఎస్.కొత్తపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఉప్పలగుప్తం: ఐదేళ్లు దాటిన ప్రతి విద్యార్థి బడి బయట కాకుండా పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు ఆదేశించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఎస్.కొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యంతో కలసి ఉపాధ్యాయులకు బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు అంతా కలసి గ్రామ స్థాయిలో చదవకుండా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ టి.మల్లికార్జున రావు, ఎంఈఓలు కె.కిరణ్‌బాబు, ఎస్.సత్యకృష్ణ, హెచ్ఎం రామకృష్ణ, సీఆర్పీ పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో మండల విద్యా శాఖ అధికారులు, సీఆర్పీల ఆధ్వర్యంలో నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. దీనిని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి జి.సూర్య ప్రకాశం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ఎంఈఓ ఎస్. దుర్గాదేవి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ ఎస్‌కే రెహమాన్, సీఆర్పీలు జి.నాగన్న, అనుష, శ్రీనుబాబు, త్రినాథ్ పాల్గొన్నారు.

## తొలిరోజే పింఛన్లు పంపిణీ చేయాలి



పింఛన్ల పంపిణీపై శిక్షణలో పాల్గొన్న అధికారులు

అల్లవరం: మండలంలోని 23 సచివాలయాల పరిధిలో తొలి రోజు జూలై 1న సచివాలయ ఉద్యోగులు వంద శాతం పింఛన్లు పంపిణీ చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 8 సచివాలయాల్లో సిబ్బంది కొరత ఉందని, వేరే సచివాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించి పింఛన్ల పంపిణీ చేపడతామన్నారు. జూలై 1న ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. మండలం వ్యాప్తంగా 9,517 మంది లబ్ధిదారులకు గాను రూ.6,27,72,000 నగదు అందిస్తామన్నారు. జేఈ సంపత్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వసతి గృహంలో సమస్యలు పరిష్కరించండి



వసతి గృహం ప్రాంగణంలో పిచ్చి మొక్కలను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక వడ్డిగూడెం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు అపరిశుభ్రమైన నీటిని తాగుతున్నారని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. వసతి గృహాన్ని ఆ పార్టీ నాయకుల బృందం గురువారం సందర్శించి పలు సమస్యలను పరిశీలించింది. రోజూ అపరిశుభ్రమైన నీటినే తాగుతున్నామని విద్యార్థినులు చెప్పారని వెంకటేశ్వరరావు అన్నారు. వాటర్ సంపుపై మూత లేకపోవడంతో వర్షం నీరు అందులో పడడాన్ని నాయకులు గమనించారు. వసతి గృహంలో చాలా రోజులుగా ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని గుర్తించారు. ఏఎస్‌డబ్ల్యూఓకు ఫోన్ చేసి వసతి గృహంలో తిష్ట వేసిన సమస్యల చిట్టాను, విద్యార్థినులు అవస్థలను నాయకులు వివరించారు. సంబంధిత శాఖ జిల్లా అధికారి తక్షణమే వసతి గృహాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు. 350 మంది విద్యార్థినులు ఉంటున్న వసతి గృహంలో పరిసరాలు, ప్రాంగణంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. విష సర్పాలు, దోమల సమస్యలు అధికమైందని వివరించారు. నాయకులు పొలమూరు శ్రీనివాసరావు, కె.శంకర్‌తో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని నరసింహారావుకు నివాళి



మాజీ ప్రధాని నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్: భారత మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. తొలుత నరసింహారావు చిత్రపటానికి ఆ జిల్లా పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమం నాయకులు వడ్డి నాగేశ్వరరావు, మాచవరపు శివన్నారాయణ, మొహబూబ్ షకీలా, పులుసుగంటి ప్రకాష్, జె.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని ముమ్మిడివరం పోలమ్మ చెరువు గట్టు వద్ద ఉన్న బుద్ధా పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రధానిగా దేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడింప జేసిన మహోన్నత వ్యక్తి నరసింహారావు అని కొనియాడారు. నాయకులు పి.ఉదయ భాస్కరవర్మ, పెన్మత్స జగ్గప్పరాజు, వడ్డి నాగేశ్వరరావు, పాలెపు ధర్మారావు, దివి వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

### నిందితుడికి జైలు

ఉప్పలగుప్తం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధించారని ఎస్ఐ కె.మనోహర జోషి శుక్రవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చల్లపల్లికి చెందిన బుడితి రమణ 2018 జనవరి 13న తన వరిచేలో నాట్లు వేస్తుండగా, అదే గ్రామానికి చెందిన కుంపట్ల చోడేశ్వరరావు సరిహద్దు విషయమై తనను కొట్టి గాయపరిచి కులం పేరుతో దూషించినట్లు రమణ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ బి.రామకృష్ణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిని అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.సోమశేఖర్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపి ముద్దాయి చోడేశ్వరరావును అరెస్టు చేసి కోర్టులో హాజరపరచగా కోర్టు రిమాండ్ విధించింది. నేరం రుజువు కావడంతో శుక్రవారం రాజమహేంద్రవరం పదో అడిషనల్ కం ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ఆర్.శ్రీలత నిందితుడు చోడేశ్వరరావుకు ఏడాది జైలు, రూ.10 వేల జరిమానా విధించారు.

### రూ.10 వేల విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పాలకొల్లుకు చెందిన రాజకొండలరావు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,001 విరాళంగా అందించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. విరాళం అందించిన దాత కుటుంబ సభ్యులకు అర్చకులు స్వామి వారి ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

## దైవ సేవకుల సదస్సు



ఎమ్మెల్యేలు ఆనందరావు, సత్యనారాయణలను సత్కరిస్తున్న షాలోమ్ ఇండియా సేవకులు

అమలాపురం రూరల్: అమలాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో షాలోమ్ ఇండియా దైవ సేవకుల సదస్సు, సంస్థ మొదటి వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. కాకినాడ నుంచి వచ్చిన యూసీవీసీ మినిస్ట్రీస్ పాస్టర్ పీటర్ దైవ సందేశం ఇచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ క్రైస్తవులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ దేవుని ఆశీస్సులు అందరికీ ఉండాలన్నారు. బీజేపీ జాతీయ కిసాన్ సెల్ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యేలను సత్కరించారు. మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, షాలోమ్ ఇండియా సేవకులు అజయ్‌కుమార్, పాస్టర్లు పి.జోసఫ్ తేజ, వసంత శేఖర్, మోషే కుమార్, పాల్ ప్రసాద్, పేతురు చార్లెస్, ఇజ్రాయేల్ పాల్, పేతురు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అడ్వకేట్ సుబ్బారావు

యానాం: చట్టంలో కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ నాగరిక్ సురక్షా సన్‌హిత–2023 సీఆర్‌పీసీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అడ్వకేట్ పడాల వెంకట సుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ కోర్టులో నూతన సీఆర్‌పీసీలపై న్యాయవాదులు, పోలీసు అధికారులు, విచారణ అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం సబ్ జడ్జి రాజామోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఇప్పటివరకూ అమలులో ఉన్న భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ), నేర శిక్షాస్మృతి (సీఆర్‌పీసీ) భారత సాక్ష్యాధార చట్టం–1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య (బీఎస్) చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. బ్రిటీష్ వలస పాలన నాటి 3 నేర చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకు వచ్చారన్నారు. ప్రస్తుత పరిస్థితులకు తగినట్లు కొత్త చట్టాల్లో అనేక నిబంధనలు ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, ఎస్సైలు మురుగానందన్, శేరు నూకరాజు, ఏపీపీ సలాది దుర్గా శ్రీనివాస్, న్యాయవాదులు కమిడి విజయకుమార్, ఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వర్తకుల ఆందోళన



ఆర్‌పీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మత్స్యకార మహిళలు

యానాం: స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని మత్స్యకార మహిళలు శుక్రవారం స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ వందలాది మంది వచ్చే మార్కెట్ అశుభ్రంగా ఉండటంతో పాటు గచ్చు పూర్తిగా నాచుపట్టి ఉండడంతో అనేక మంది జారిపడి గాయాల పాలవుతున్నారన్నారు. ఆ విధంగా చేపలు అమ్మే మహిళ జారిపడటంతో గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనకారులతో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ చర్చించారు. మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వర్షం తగ్గినా వీడని ముంపు



అప్పనపల్లిలో ఆర్అండ్‌బీ రోడ్డుపై భారీగా నిలిచిన వర్షం నీరు

మామిడికుదురు: రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షానికి రహదారులు పూర్తిగా పాడైపోయాయి. శుక్రవారం వాతావరణం శాంతించింది. వర్షం తగ్గడంతో ప్రజలు సేద తీరారు. అయినప్పటికీ రోడ్లపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అప్పనపల్లిలో ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డుపై పలు చోట్ల ముంపు నీరు నిలిచిపోయింది. అది ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పలేదు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, మామిడికుదురు, మొగలికుదురు, గెద్దాడ గ్రామాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. మామిడికుదురు 216వ నంబర్ జాతీయ రహదారి నుంచి కొర్లగుంట వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా పాడైపోవడంతో అటు వైపు ద్విచక్ర వాహనాలు మినహా మిగిలిన వాహనాలు వెళ్లకుండా స్థానికులు కట్టడి చేశారు. రోడ్డుకు రెండు వైపులా కర్రలు పాతి కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లే విధంగా వెదురుగెడలు కట్టారు. ఈ మార్గంలో రాకపోకలు ప్రమాదకరంగా మారాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లకు పిల్లలను పంపించండి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రాడ్యుయేషన్ డే

సఖినేటిపల్లి: మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌కు పంపాలని రాజోలు ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి కోరారు. శుక్రవారం ఉయ్యూరువారి మెరక అంగన్‌వాడీ సెంటర్‌లో సర్పంచ్ ఓగూరి రత్నకుమారి అధ్యక్షతన అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో రమాదేవి మాట్లాడుతూ, ప్రీ స్కూల్స్ నందు మంచి వాతావరణంలో పిల్లలకు సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఎంపీటీసీ గుబ్బల అంజిబాబు, సూపర్‌వైజర్ కె.చంద్రకళ, చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్స్ అధికారి వాణి, మహిళా పోలీసులు మీనాకుమారి, సూజన్, టీచర్లు రత్నకుమారి, నందిని, పద్మావతి, శేషవేణి, జ్యోతి విజయలక్ష్మి, పార్వతి, సూర్యకుమారి పాల్గొన్నారు.